రేషన్ బండి.. ఇక రాదండి!

- రేషన్ వాహనాలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
- చౌక దుకాణాల వద్ద బియ్యం సరఫరాకు నిర్ణయం
- పనులు మానుకుని గంటల తరబడి క్యూలో నిలుచోవాల్సిన పరిస్థితి
- గతాన్ని తలుచుకుని ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

ఒకటో తేదీ వచ్చిందంటే హారన్ కొట్టుకుంటూ రేషన్ బండి ఇంటి ముంగిట ఆగేది. లబ్ధిదారులు కార్డు తీసుకెళితే ఐదు నిమిషాల్లో బియ్యం వేసేవారు. ఎలాంటి రావాణా ఖర్చులు, వ్యయ ప్రయాసలు ఉండేవి కావు. ముఖ్యంగా ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు ఈ విధానం ఎంతగానో ఉపయోగంగా ఉండేది. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సజావుగా సాగుతున్న ఈ విధానంపై టీడీపీకి కుళ్లు పుట్టింది. వైఎస్ జగన్ ముద్ర కనిపించకూడదనే ఉద్దేశంతో రేషన్ వాహనాలను రద్దు చేయడానికి సిద్ధమైంది. మళ్లీ రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ చేయడానికి నిర్ణయించింది. గతంలోలా పనులు మానుకుని గంటల తరబడి క్యూలో నిల్చొని రేషన్ తీసుకోవాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



గతంలో చౌక దుకాణం వద్ద రేషన్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు (ఫైల్), వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్ద వచ్చిన వాహనం ద్వారా రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

బనగానపల్లె/డోన్: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, సుపరిపాలనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేసింది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించింది. రేషన్ వాహనాలను ఏర్పాటు చేసి ఇంటి వద్దే బియ్యం, చెక్కర, కందిపప్పు సరఫరా చేసింది. అయితే రెండు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మొబైల్ వ్యాన్‌ల ద్వారా సరుకులు ఇచ్చే విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతి ద్వారా రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలనుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతోంది.

గత టీడీపీ హయాంలో ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చౌక దుకాణాలకు వెళ్లేందుకు లబ్ధిదారులు అనేక వ్యయప్రయాసలకు గురయ్యేవారు. రేషన్ షాపుల వద్ద సరుకులు పొందేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సిన వచ్చేది. చాలా మంది సకాలంలో రేషన్ దుకాణానికి వెళ్లలేకపోవడంతో మొక్కుబడిగా ఒకటి, రెండు రోజులు వేసి మొత్తం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేవారు. ఇలాంటి పరిస్థితిని నివారించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐరిష్, డిజిటల్ పద్ధతి ద్వారా వేలిముద్రలు సేకరించి ఇంటి వద్దనే నాణ్యమైన బియ్యాన్ని, నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు అందించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ వాహనాల ద్వారా ఇంటి ముంగిటకే వచ్చి సరుకులు పంపిణీ చేసేవారు. ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లలేని వయోవృద్ధుల ఇళ్ల వద్ద ఎండీయూ వాహనదారులే రేషన్ సరుకులను తీసుకెళ్లి ఇంటిలో ఉంచేవారు. వాహనాల రద్దుతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరోవైపు తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఎండీయూ వాహన డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బనగానపల్లె నియోజకవర్గంలో రేషన్ వివరాలు

మండలం	రేషన్ దుకాణాలు	ఎండీయూ వాహనాలు	రేషన్ కార్డులు
బనగానపల్లె	58	19	36,139
అవుకు	41	10	16,074
కోవెలకుంట్ల	34	9	14,064
కొలిమిగుండ్ల	44	10	16,227
సంజామల	32	8	12,062
డోన్ నియోజకవర్గంలో..			
డోన్	72	27	36,093
ప్యాపిలి	54	14	22,936
బేతంచెర్ల	48	17	27,451

జీవనోపాధి పోయింది



రేషన్ బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను రద్దు చేయడం వల్ల మాకు జీవనోపాధి లేకుండా పోయింది. సడన్‌గా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బతుకు దెరువు లేకుండా పోయింది. నెలలో పదిహేను రోజుల పాటు కార్డుదారులకు రేషన్ పంపిణీ చేసి మిగిలిన రోజుల్లో కూలీ పనులకు పోతుఉండేవాడిని. మా కుటుంబంలో ఐదుమంది సభ్యులం ఉన్నాం. ఇప్పుడు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.
–అమీర్, ఎండీయూ ఆపరేటర్, తిమ్మనాయినపేట

రేషన్‌షాపుకు 3 కిలోమీటర్లు వెళ్లాలా?



గత ప్రభుత్వం రేషన్ బియ్యం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనం మా గ్రామానికే వచ్చేది. ఇంటి వద్దనే రేషన్ బియ్యం తీసుకున్నాం. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వాహనాలను రద్దు చేయాలనుకోవడం సరైన నిర్ణయం కాదు. మా గ్రామానికి రేషన్ వాహనం రాకపోతే ప్రతి నెలా 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంగళాంపల్లికి వెళ్లాలి. వృద్ధులు, దివ్యాంగులు ఎలా తెచ్చుకుంటారనే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలి. వాహనం ద్వారానే రేషన్ పంపిణీ చేయాలి. –ప్రమీల, ఓబులదేవరపల్లి, ప్యాపిలి

కష్టాలు తప్పవు



వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ విధానాన్ని రద్దు చేయాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గం. గతంలో రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి వేచిచూసినా డీలర్లు సక్రమంగా రేషన్ పంపిణీ చేసేవారు కాదు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టడమే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా డీలర్ల వద్ద రేషన్ సరుకులు పొందే సౌకర్యాన్ని లబ్ధిదారులకు కల్పించారు. తిరిగి పాత పద్ధతిని ఏర్పాటు చేస్తే కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. –లక్ష్మీదేవి, గృహిణి, వెంకటనాయునిపల్లె, డోన్

నా లాంటి వాళ్లకు చాలా కష్టం



ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యం ఇచ్చేవాళ్లు. వయసు మీద పడడంతో నడవడం కష్టంగా ఉంది. ఇప్పుడు రేషన్ బియ్యం ఇచ్చే వాహనాలను తీసేశారని చెబుతున్నారు. నాలాంటి ముసలోళ్లకు చాలా కష్టపడాల్సి వస్తుంది. నాకు తోడుగా కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. ఒంటరిగా సత్రంలో ఉంటున్నాను. డీలర్ దగ్గరకు పోయి వేలి ముద్ర వేయాలంటే కష్టంగా ఉంటుంది. –లింగమ్మ, కొలిమిగుండ్ల

ప్రతి నెలా ఇంటి వద్దనే రేషన్ అందేది



గతంలో రేషన్ షాపులకు వెళ్లి ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, చక్కెర, తదితర నిత్యావసర సరుకులు తీసుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ ద్వారా ప్రతి నెలా ఇంటి వద్దనే రేషన్ తీసుకున్నాం. కూటమి ప్రభుత్వం ఇంటివద్దకు రేషన్ పంపిణీని రద్దు చేసి తిరిగి రేషన్ షాపులను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. బియ్యం బండ్ల ద్వారా ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇళ్లవద్దే రేషన్ సరఫరా చేశారు. ఈ విధానం రద్దు చేయాలనుకోవడం మంచి పద్ధతి కాదు. –దినకర్, వల్లం, కోవెలకుంట్ల

క్లుప్తంగా

కోవెలకుంట్ల తహసీల్దార్‌గా పవన్‌కుమార్‌రెడ్డి


వీఆర్వోలు, సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: మండల తహసీల్దార్‌గా పవన్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నిక నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు చెందిన జయప్రకాష్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో తహసీల్దార్‌గా నియమించారు. ఇటీవలే ఎన్నికల సమయంలో నియమించిన తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేశారు. ఇందులో భాగంగా బనగానపల్లె ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డిని ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా నియమించడంతో విధుల్లో చేరారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

డోన్ తహసీల్దార్ బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగమణి

డోన్ రూరల్: మండల తహసీల్దార్‌గా కె.నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు మండలంలోని వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది దుస్సాలువాలు, పూలమాలలతో అభినందనలు తెలిపారు. వీరిలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, ఆర్ఐ మధు, వీఆర్వోలు గోవింద్, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, సునీల్, రాజు, మహనంది తదితరులు ఉన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని నూతన తహసీల్దార్ తెలిపారు.

కొలిమిగుండ్ల తహసీల్దార్..

కొలిమిగుండ్ల: స్థానిక తహసీల్దార్‌గా బాల ఈశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. తర్వాత సిబ్బందితో సమావేశమై పలు విషయాలపై చర్చించారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులు



డోన్ రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లా గుత్తి మండలానికి బదిలీపై వెళ్లి తిరిగి డోన్ మండల ఎంపీడీఓగా వచ్చారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


శ్రీనివాసరావు(ఫైల్)

కొలిమిగుండ్ల: కోటపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు(45) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణంలో నివాసం ఉంటూ ప్రతి రోజు పాఠశాలకు హాజరవుతుండేవారు. మూడేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇంటి దగ్గర ఉన్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందారు. ఉపాధ్యాయుడి మృతితో ఎంఈఓ అబ్దుల్ కలాం పాఠశాలకు సెలవు ప్రకటించారు. ఎమ్మార్సీ సిబ్బంది జమ్మలమడుగుకు చేరుకుని శ్రీనివాసరావు మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


21వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

డోన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోగలిగితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా డీఈ రసూల్, ఏఈ సతీష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాతో కలిసి సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు వీధులను సందర్శించారు. స్థానికులు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ తడి, పొడి చెత్తలను సేకరించేందుకు మున్సిపల్ సిబ్బంది ఇళ్ల వద్దకే వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

పాతబుగ్గలో ప్రత్యేక పూజలు



డోన్ టౌన్: పట్టణ సమీపంలోని పాతబుగ్గలో వెలసిన రామలింగేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సునీల్ శర్మ, ఆలయ ధర్మకర్త బైసాని రాజు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రకాష్ ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ సయ్యద్ దున్నీసా

కోవెలకుంట్ల: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని.. వీరు పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ సయ్యద్ దున్నీసా అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. ఈఓపీఆర్డీ రాధిక, సర్పంచ్‌లు మెట్ల సరళ, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

సర్పంచ్‌ల శిక్షణ తరగతులు ప్రారంభం

కొలిమిగుండ్ల: స్థానిక ఐకేపీ కార్యాలయంలో సర్పంచ్‌ల శిక్షణ తరగతులను ఈఓఆర్డీ శ్రీహరి సోమవారం ప్రారంభించారు. మండలంలోని వివిధ పంచాయితీలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. పంచాయతీల్లో ఆదాయ మార్గాలు పెంచుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఈఓఆర్డీ సూచించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం లోపం లేకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. శిక్షణ తరగతుల్లో భాగంగా పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్తం

26 గొర్రెలు అపహరణ

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో 26 గొర్రెలను సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కొలిమిగుండ్లకు చెందిన రాజనేని మధు సూదన్ గ్రామ శివారులో 350 గొర్రెల మందను చుట్టు కంపతో కంచె వేసి ఏర్పాటు చేసుకున్నాడు. శని, ఆదివారాల్లో కూతురు పెండ్లి ఉండడంతో పనుల్లో నిమగ్నమయ్యాడు. ఉదయం గొర్రెల మంద వద్దకు చేరుకుని చూడగా వెనుక భాగంలో కంపను తొలగించి గొర్రెలు తీసుకెళ్లారు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అపహరణకు గురైన గొర్రెల విలువ సుమారు రూ.4లక్షల మేర ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

బాధ్యతగా పనిచేస్తేనే లక్ష్య సాధన

బేతంచెర్ల: ప్రభుత్వం అక్టోబర్ 10వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుందని.. వాటిని అధిగమించేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలని డోన్ హౌసింగ్ డీఈఈ రాజశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఇన్‌చార్జి ఏఈ రామ్మోహన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల రికార్డులను పరిశీలించి, సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలానికి 178 ఇళ్ల పూర్తి చేయాలని నిర్దేశించడం జరిగిందని, అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల త్వరగా పూర్తయ్యే విధంగా పని చేయాలని సూచించారు. వర్క్ఇన్‌స్పెక్టర్ ఆనంద్ ఉన్నారు.

ఇటిక్యాలలో మల్టీపర్పస్ షెడ్డు ప్రారంభం

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఇటిక్యాలలో చేపట్టిన నిర్మాణాలను యూనిట్‌హెడ్ రెడ్డినాగరాజు, అడ్మిన్ హెడ్ రామరాజు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ప్రాథమిక పాఠశాలలో రూ.8 లక్షలతో మల్టీ పర్పస్ షెడ్డు, ప్రధాన రహదారి పక్కలో రూ.10 లక్షలతో బస్ షెల్టర్ నిర్మించారు. కంపెనీ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్ కలాం, జనరల్ మేనేజర్ రవికుమార్, ఏజీఎం శోభన్‌బాబు, సీఎస్ఆర్ మేనేజర్ అఖిల్ పాల్గొన్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో 60 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సెబ్ సీఐ జోగేంద్ర సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సుంకమ్మ తన ఇంటి వద్ద సారాతో ఉండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సెబ్ సిబ్బంది వెంకటరమణ, ప్రసన్న, పాములేటి ఉన్నారు.

వాహనాలకు రికార్డులు తప్పనిసరి

ప్యాపిలి: వాహనాలకు ఫిట్నెస్, పర్మిట్, ఇన్సూరెన్సు, డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. ప్యాపిలిలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని ఏడు వాహనాలను గుర్తించి రూ.1, 61,390 జరిమానా విధించారు. పలు వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు.

బాధ్యతల స్వీకరణ


మల్లికార్జునరెడ్డి

అవుకు: మండల ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా మల్లికార్జున రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాలలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. డీటీ పోతుల ప్రసాద్ బాబు, ఆర్ఐ రాముడు, వీఆర్వోలు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ట్యాంకు వద్ద సోమవారం మద్యం, నాటు సారా విక్రయిస్తున్న గొల్ల శంకరయ్యను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు. అతని వద్ద నుంచి 14 మద్యం బాటిళ్లు, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్యాపిలి: జలదుర్గం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, మాధవరం, గార్లదిన్నె గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

దాడి కేసు నమోదు

సంజామల: గిద్దలూరు గ్రామానికి చెందిన తెలుగు రామలింగయ్యపై దాడి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన తెలుగు రామలింగయ్య భార్యతో కలిసి తన పొలం వద్దకు వెళ్తుండగా తెలుగు ప్రసాద్, తెలుగు వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు. గొడవ సర్దుమనిగి ఇంటికి వచ్చారు. సాయంత్రం బస్టాండ్ దగ్గర కూరగాయలు అమ్ముకుంటున్న రామలింగయ్యపై తెలుగు ప్రసాద్, తెలుగు వేంకటేశ్వర్లు, తెలుగు శేషాద్రి దాడి చేశారు.

సమస్యలపై వినతి

ప్యాపిలి: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు విజయకుమారి, ఓబులమ్మ, గౌరి, ఫర్హాన, చాముండేశ్వరి డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ. 26 వేలతో పాటు ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు.

జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్‌కు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సంజామల: జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు సంజామల ప్రభుత్వ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 10, 11వ తేదీల్లో కర్నూలు జిల్లా గార్గేయపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జి.చిన్మయ్, స్మృతి, రుఫియా, బి.రూబా తబసుమ్, కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు ఐశ్వర్యయ్య, నాగ తాప్సి యాదవ్, గురు హర్షిత, కీర్తన, స్వరూప ప్రతిభ చాటారు. విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులను కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రిన్సిపాల్ శ్రీలేఖ అన్నారు. జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు, సంజామల మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం


ఆకుమల్లలో ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి ధరణి

సంజామల: ఆయిల్ పామ్ సాగు రైతులకు అన్ని విధాల లాభదాయకమని, తక్కువ ఖర్చుతో 25 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చని మండల ఉద్యానశాఖ అధికారి ధరణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆకుమల్లలో కాసన శ్రీనివాసరెడ్డి పొలంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 3 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. అనంతరం ఉద్యాన శాఖ అధికారి మాట్లడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వ రాయితీ అందిస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సంపాదించడానికి చక్కటి అవకాశం అని పేర్కొన్నారు. రైతులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఇందులో అంతర్ పంటలకు అవకాశం ఉంటుందని తెలిపారు. పతాంజలి ఫుడ్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ ఎం.మహదేవయ్య, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మానస తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు


బాధితుడుని పరిశీలిస్తున్న ఎస్ఐ

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రహదారిలో సోమవారం రాత్రి ఓ వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దుర్గాపేట కాలనీకి చెందిన గజ్జి శ్రీనివాసులు బనగానపల్లె రహదారిలోని పాలిష్ ఫ్యాక్టరీకి వెళ్లి వస్తుండగా కొందరు రాళ్లు, రాడ్లు, కట్టెలతో దాడి చేసి రహదారిపై వదిలి వెళ్లారు. అటు వైపు వస్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడిన అతన్ని శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఎస్ఐ శివశంకర్ నాయక్ ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. పాత కక్షలతో అదే కాలనీకి చెందిన గూటం శివ, సాయి, మదన్ దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

డోన్ రూరల్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం డోన్ రైల్వేస్టేషన్ ఎదుట మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 18 నెలల డీఏ బకాయిలను చెల్లించాలని కోరారు. డోన్ బ్రాంచ్ సెక్రటరీ అహ్మద్‌బాషా, చైర్మన్ సుధాకర్, ట్రెజరర్ నాగరాజు, దామోదర్‌రెడ్డి, క్రిష్ణశంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా ధ్రువీకరణ పత్రాలు సమర్పించండి

బేతంచెర్ల: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులందరూ తమ ఆధార్, పాన్ కార్డును తప్పక అందజేయాలని సొసైటీ కార్యదర్శి ఓబులేసు అన్నారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలను వారం రోజుల్లో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆరోపణలు మాని.. అభివృద్ధి చేయండి


మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: టీడీపీ నాయకులకు దమ్ముంటే వైఎస్సార్‌సీపీ హయాంలో డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ఆ తర్వాత మాట్లాడాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ హితవుపలికారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం వారు మాట్లాడుతూ.. ఇటీవల నియోజకవర్గంలో జరిగిన ఘర్షణలకు వైఎస్సార్‌సీపీ నాయకులే కారణమని టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి వచ్చి నెలలు కాకముందే రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చింది టీడీపీ కాదా అని ప్రశ్నించారు. డోన్ మండలం వెంకటనాయునిపల్లెతో పాటు ప్యాపిలిలో జరిగిన పొలం గట్టు వివాదాలను తమకు అంటగట్టడం బట్టకాల్చి ముఖాన వేయడమేనన్నారు. మాజీ మంత్రి బుగ్గన చొరవతో ప్యాపిలిలో రూ.49.50 కోట్లతో మంజూరైన ఇంటిగ్రేడ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. బుగ్గనపై డోన్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వలసల రామకృష్ణ ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, పోస్టుప్రసాద్ అన్నారు. వాల్మీకులను అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకునే వలసల గురించి తెలియని వారెవరూ లేరన్నారు. ఎమ్మెల్యే కోట్ల వాల్మీకులపై దాడి చేసినా, పగిడ్యాల మండలంలో వాల్మీకి బాలిక అదృశ్యమైనా నోరు మెదపని వలసల వాల్మీకి నాయకుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. నాయకులు కురుకుంద హరి, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, వెంకట్రాముడు, రఘురాం, మిట్టా రవికుమార్, వంశీ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కోవెలకుంట్ల: వైద్య సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డి స్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఫర్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) డాక్టర్ జఫ్రుల్లా తెలిపారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో రోగులకు అన్ని వసతులు సమకూర్చుతున్నారా అనే విషయాలపై సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆరా తీశారు. ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

అవుకు: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా సూచించారు. సోమవారం అవుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఫార్మసీ, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ అభినయ్, జనరల్ సర్జన్ జయరాముడు, ఇందిరా కళ్యాణి, రవికుమార్ తదితరులు ఉన్నారు.